క్లుప్తంగా

పీహెచ్‌సీ పరిసరాలు శుభ్రం



సాక్షి ఎఫెక్ట్..

దుత్తలూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాలను శుభ్రం చేశారు. ఇటీవల 'ఆస్పత్రిలో వేధిస్తున్న సమస్యలు' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన వైద్యాధికారి ఆస్పత్రి పరిసరాల్లోని పిచ్చిమొక్కలు తొలగించారు. మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించారు.

ఇమామ్‌లు, మౌజన్‌ల నిరసన



ఆత్మకూరు: మసీదులు, దర్గాల్లో పనిచేస్తున్న తమకు గత పది నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, ప్రభుత్వం వెంటనే స్పందించి మంజూరు చేయాలని ఇమామ్‌లు, మౌజన్లు కోరారు. పట్టణంలోని పడమరవీధి పెద్దమసీదు వద్ద ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ముస్లిం మతపెద్దలతో కలిసి మౌజన్‌లు, ఇమామ్‌లు శుక్రవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించి జీతాలు ఇవ్వాలని వారు కోరారు.

పాఠశాలకు ల్యాప్‌టాప్ బహూకరణ



ఆత్మకూరు: పట్టణంలోని వెస్ట్ ప్రాథమిక పాఠశాలకు పట్టణానికి చెందిన ఇందూరు వెంకటరమణారెడ్డి తన మనుమరాలు పుట్టిన రోజును పురస్కరించుకుని శుక్రవారం ల్యాప్‌టాప్‌ను బహూకరించారు. హెచ్‌ఎం సీతాదేవికి ల్యాప్‌టాప్‌ను అందజేశారు. ఇందూరు సుజాతమ్మ, హేమంత్‌కుమార్‌రెడ్డి, అనూష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్యకు నివాళులు



సంగం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని పురస్కరించుకుని మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి, ఎంపీడీఓ షాలెట్ శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈఓపీఆర్డీ ప్రసాద్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు 17 మంది విద్యార్థుల ఎంపిక



జలదంకి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 17 మంది విద్యార్థులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌లకు ఎంపికయ్యారు. గతేడాది నిర్వహించిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్షల్లో ప్రతిభకనబర్చి ఉపకారవేతనాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని హెచ్‌ఎం మాల్యాద్రి శుక్రవారం అభినందించారు. విద్యార్థుల విజయంలో కీలకపాత్ర పోషించిన గణిత ఉపాధ్యాయుడు రమేష్, సైన్స్ ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, ప్రభాకర్‌ను అభినందించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ఉదయగిరి: గుడినరవలోని రైతుసేవా కేంద్రంలో రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ సహకారంతో కొట్టాలపల్లి ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పర్సన్ ఇన్‌చార్జి పీ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం గ్రేడ్‌-ఏ రకం ధాన్యం క్వింటాకు రూ.2,320, సాధారణ రకం క్వింటాకు రూ.2,300 చొప్పున మద్దతు ధర నిర్ణయించిందని తెలిపారు. ఈ మేరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని చెప్పారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సొసైటీ సీఈఓ పోలయ్య, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లోనూ రాజకీయం!

మేట్ల నియామకాల్లో పచ్చపాతం

- కూటమి కార్యకర్తలకే అవకాశం
- ప్రతి 50 మంది కూలీలకు ఒకరిని నియమించేందుకు సన్నాహాలు
- తద్వారా కూలీలను కూటమి వైపు మళ్లించేందుకు ఎత్తుగడ



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

సీతారామపురం : ఉపాధి హామీ పథకం పనులను కూటమి ప్రభుత్వం రాజకీయం చేస్తోంది. అందులో పనిచేస్తున్న వేతనదారులను కూటమి వైపు మళ్లించేందుకు ప్రభుత్వం ఎత్తుగడ వేసింది. వేతనదారులను మోటివేట్ చేసి ఓటు బ్యాంకును పెంచుకునేందుకు కూటమి నాయకులకు అనుకూలంగా ఉన్న వారిని మేట్లుగా నియమించేందుకు ప్రయత్నాలను ప్రారంభించింది. అందులో భాగంగా ఇటీవల ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ప్రతి 50 మంది వేతనదారులకు ఒక మేట్‌ను నియమించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే అదనుగా కూటమి నాయకులు తమ అనుచరులను నియమించుకునేందుకు చర్యలు మొదలుపెట్టారు. ప్రతి వేతనదారుకు రూ.1.50 చొప్పున మేట్‌కు ప్రభుత్వం చెల్లిస్తుంది. ఒక మేట్ పరిధిలో ఉండే 50 మంది వేతనదారులకు సంబంధించి రోజుకు రూ.75ను చెల్లిస్తుంది.

ఇదీ పరిస్థితి

గతంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న మేట్లలో అధిక శాతం మంది వైఎస్సార్‌సీపీ అభిమానులుగా ఉన్నట్లుగా కూటమి ప్రభుత్వం భావిస్తోంది. అందుకే కూటమి ప్రతినిధులు ఉండేలా ప్రభుత్వం కొత్త ఆలోచనకు తెర తీసింది. అందులో భాగంగానే ప్రతి 50 మంది వేతనదారులకు ఒక కొత్త మేట్‌ను నియమించేందుకు చురుగ్గా కార్యాచరణను చేపడుతోంది. గతంలో 75 మంది జాబ్ కార్డుదారులకు ఒక మేట్ ఉండేవాడు. ప్రస్తుతం ప్రతి 50 మందికి ఒక మేట్ నియామకం చేపడుతుండడంతో జిల్లాలో మేట్ల సంఖ్య మూడు రెట్లు పెరగనుంది.

8720 మంది మేట్ల నియామకానికి కసరత్తు

జిల్లాలోని 38 మండలాల పరిధిలో 722 పంచాయతీల్లో 3.43 లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయి. అందులో 2.77 లక్షలు క్రియాశీలక కార్డులు కాగా, 4.36 లక్షల మంది క్రియాశీలక కూలీలు ఉన్నారు. వారంతా క్షేత్రస్థాయిలో ఉపాధి పనులకు వచ్చినప్పుడు పర్యవేక్షించేందుకు 8,720 మంది మేట్లను జిల్లా వ్యాప్తంగా కొత్తగా నియమించేందుకు కసరత్తు చేపడుతున్నారు. గతంలో పనిచేస్తున్న మేట్లను తొలగించి వారి స్థానంలో కొత్త వారిని నియమించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

పాతవారిని తొలగించడం తగదు



ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న పాత మేట్లను తొలగిస్తారనే ప్రచారం గ్రామాల్లో సాగుతోంది. పాత వారి జోలికెళ్లకుండా కొత్తవారిని నియమించుకోవాలి. పారదర్శకంగా ఉపాధి పనులు చేపట్టేందుకు అధికారులు చొరవ చూపాలి.

– చింతం రెడ్డి పద్మావతి, ఎంపీపీ, సీతారామపురం

సీనియర్లకు అవకాశం కల్పించాలి



ఉపాధి హామీ పనుల్లో రాజకీయాలు తగవు. వేతనదారుల్లోని సీనియర్లకు మేట్లుగా అవకాశం కల్పించాలి. అంతేతప్ప ఇష్టం వచ్చినట్లు మేట్లను ఎంపిక చేయడం సమంజసం కాదు.

– చప్పిడి తిరుపతిరెడ్డి, సర్పంచ్, గుండుపల్లి

నిబంధనల ప్రకారమే నియామకం



కొత్తగా మేట్ల నియామకానికి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ప్రతి 50 మంది వేతనదారుల పని తీరును పర్యవేక్షించేందుకు ఒక మేట్‌ను నియమించనున్నాం. వీరితో ఉపాధి పనులకు దరఖాస్తు మొదలు మస్టర్లు వేయడం, కొలతల మేరకు పనులు పక్కాగా చేపట్టేలా చర్యలు తీసుకోనున్నాం.

–గాయత్రిదేవి, ఏపీడీ, ఉదయగిరి

ఐసీడీఎస్ ఉదయగిరి ప్రాజెక్ట్ ఇన్‌చార్జి సీడీపీఓగా సునీత



ఉదయగిరి: ఐసీడీఎస్ ఉదయగిరి ప్రాజెక్ట్ ఇన్‌చార్జి సీడీపీఓగా ఎన్ సునీత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరులోని పీడీ కార్యాలయంలో ఎక్స్‌టెన్షన్ అధికారిణిగా పనిచేస్తున్న ఆమె పీడీ ఆదేశాల మేరకు ఇన్‌చార్జి సీడీపీఓగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. అంగన్‌వాడీలు తమ విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోడ్డు పనుల పరిశీలన



చేజర్ల: మండలంలోని పుట్టుపల్లి–పెరుమాళ్లపాడు రోడ్డు పనులను తహసీల్దార్ మురళి శుక్రవారం పరిశీలించారు. పుట్టుపల్లి నుంచి పెరుమాళ్లపాడు వరకు సుమారు కిలోమీటర్ దూరం రోడ్డును రూ.87.50 లక్షలతో నిర్మిస్తున్నారు. అందులో భాగంగా రోడ్డు హద్దులను తహసీల్దార్ పరిశీలించారు. ఆయన వెంట ఆర్‌ఐ వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఏఈ హరీష్ ఉన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు



సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ఆత్మకూరురూరల్: పారిశుధ్యం మెరుగుకు చర్యలు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్, ఈఓపీఆర్డీ డేవిడ్ తెలిపారు. మండలంలోని నాగులపాడు, రావులకొల్లు గ్రామాల్లో శుక్రవారం వారు పర్యటించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం, ఇంకుడు గుంతల నిర్మాణాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో 397 ఇంకుడు గుంతల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం అమల్లో భాగంగా అన్ని పంచాయతీల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగులపాడు సర్పంచ్ సోమవరపు వెంకటరమణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి జునైద్, ఎమ్మార్సీ బ్రహ్మయ్య, ఉపాధి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిపై నిలదీత



మున్సిపల్, సచివాలయ సిబ్బందిని నిలదీస్తున్న స్థానికులు

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని జేఆర్‌పేటలో తాగునీటిని సక్రమంగా సరఫరా చేయకపోవడంపై స్థానికులు మున్సిపల్ సిబ్బందిని శుక్రవారం నిలదీశారు. జేఆర్‌పేట ప్రాంతంలో మేధా పాఠశాల లైన్, జవహర్‌లాల్‌లైన్, తదితర ప్రాంతాల్లో పైపులైన్‌లు దెబ్బతినడంతో తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని, తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోయారు. పైపులైన్లు మార్చి సక్రమంగా నీరు సరఫరా చేయాలని మున్సిపల్, సచివాలయ సిబ్బందిని కోరారు. కమిషనర్‌కు అక్కడి నుంచే ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఫిబ్రవరిలోనే పరిస్థితి ఇలా ఉంటే రానున్న వేసవిలో తాగునీటి కోసం ఇబ్బందులు పడాల్సి వస్తుందేమోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. స్పందించిన కమిషనర్ సమస్యను పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఆటోవాలాలకు సూచనలు చేస్తున్న సీఐ జీ గంగాధర్

ఆత్మకూరు: ఆటోవాలాలు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆత్మకూరు సీఐ జీ గంగాధర్ సూచించారు. పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్ వద్ద ఆటోవాలాలతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించకుండా సూచించిన ప్రదేశాల్లోనే ఆటోలను పార్కింగ్ చేసుకోవాలని సూచించారు. ప్రయాణికుల పట్ల మర్యాదగా నడుచుకోవాలన్నారు. ముఖ్యంగా మహిళలు అభద్రతా భావానికి లోను కాకుండా వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు. మహిళల పట్ల అమర్యాదగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉపాధి పనుల్లో అవకతవకలపై విచారణ



సీతారామపురం: మండలంలోని మారంరెడ్డిపల్లి పంచాయతీలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో చోటు చేసుకున్న అవినీతి, అక్రమాలపై కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక అధికారుల బృందం శుక్రవారం విచారణ చేపట్టింది. క్షేత్రస్థాయిలో కూలీలకు పని కల్పన, యంత్రాలతో పనుల నిర్వహణ, నగదు పంపిణీలో వాటాలు, మస్టర్లలో బినామీల హాజరు, పాత పనులనే మళ్లీ చేపట్టడం, తదితరాలపై అధికారుల బృందం గ్రామంలో పర్యటించి విచారణ చేపట్టింది. బహిర్గతమైన విషయాలపై సమగ్ర నివేదిక తయారుచేసి కలెక్టరుకు అందజేయనున్నట్లు వారు తెలిపారు. సోషల్ ఆడిట్ జిల్లా విజిలెన్స్ అధికారిణి విజయలక్ష్మి, డీబీటీ మేనేజర్ నాయుడు, ఏబీడీ శంకరనారాయణ, ఎంపీడీఓ భాస్కర్, ఏపీఓ సుభాషిణి పాల్గొన్నారు.

మద్యం దుకాణం ఏర్పాటుపై రగడ



ఎక్సైజ్ సీఐతో మాట్లాడుతున్న అధికార పార్టీ నాయకులు

సోమశిల: అనంతసాగరంలో ప్రభుత్వం కొత్తగా గౌడ్‌లకు కేటాయించిన మద్యం షాపు ఏర్పాటు విషయంలో అధికార పార్టీలో రగడ నెలకొంది. ఇప్పటికే బస్టాండ్ సెంటర్‌లో మద్యం షాపు ఉండగా, కొత్తగా గౌడ్‌లకు కేటాయించిన మద్యం దుకాణాన్ని నెల్లూరుకు చెందిన వారు స్థానిక అధికార పార్టీ నాయకుల సహకారంతో మార్కెట్ యార్డు రోడ్డు సమీపంలో శుక్రవారం ప్రారంభించారు. దాన్ని పరిశీలించేందుకు ఆత్మకూరు ఎక్సైజ్ సీఐ రాగా అధికార పార్టీలోని మరోవర్గం కొత్త దుకాణం ఏర్పాటుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ వినతిపత్రం అందజేసింది. మార్కెట్ యార్డు రోడ్డు సమీపంలో పోస్టాఫీస్, తహసీల్దార్, ఎంపీడీఓ, పోలీస్‌స్టేషన్, వెలుగు కార్యాలయాలు ఉన్నాయని, మహిళలు కార్యాలయాలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతారని తెలిపారు. కాగా కొత్త దుకాణానికి మద్దతు తెలుపుతున్న వారు పాత దుకాణాన్ని బడికి వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసి ఉన్నారని, దాన్ని తొలగించాలని అభ్యంతరం తెలిపారు.

దాసరపల్లి సర్పంచ్‌కు సన్మానం

ఉదయగిరి: మండలంలోని దాసరపల్లి సర్పంచ్ సయ్యద్ గౌస్‌మొహిద్దీన్ మక్కా యాత్రకు బయల్దేరుతున్న సందర్భంగా ఆయన్ని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం సత్కరించారు. మక్కా యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకుని రావాలని ఆకాంక్షించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జీ ఓబుల్‌రెడ్డి ఉదయగిరి ఉపసర్పంచ్ ముర్తుజాహుస్సేన్, స్థానిక నేతలు యస్దాని, శ్రీనివాసులురెడ్డి, గడియాల్చి యస్దాని, ఉప్పుటూరి హరి, ఎంపీ రియాజ్, మస్తాన్, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

'స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర'లో భాగస్వాములు కావాలి

ఉదయగిరి: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీల్లో శనివారం నిర్వహించే స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీఓ అప్పాజీ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. గ్రామ సచివాలయ, పంచాయతీ సిబ్బంది, స్థానిక నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పరిసరాలను శుభ్రం చేయాలని విజ్ఞప్తి చేశారు.

మేదర, కుమ్మరులకు సబ్సిడీ రుణాలు

ఉదయగిరి మండలంలోని మేదర, కుమ్మరులకు ఒక్కొక్కటి చొప్పున సబ్సిడీ రుణ యూనిట్లు మంజూరైనట్లు ఎంపీడీఓ అప్పాజీ తెలిపారు. అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని మండల పరిషత్ కార్యాలయంలో ఒకసెట్‌ను అందజేయాలని కోరారు.

ఆటపాటలతో విద్యను అందించాలి

అల్లూరు: స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాలలో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ–పఢాయి భీపై రెండ్రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఐసీడీఎస్ సీడీపీఓ కే సౌజన్య ముఖ్యఅతిథిగా హాజరై శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పోషకాహారంతో పాటు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని సూచించారు. రెండ్రోజుల పాటు వంద రోజుల సంరక్షణ, తల్లిపాలు, గ్రోత్ మానిటరింగ్, సమతుల ఆహారం, వ్యక్తిగత పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఆహార వైవిధ్యం, స్థూల, సూక్ష్మ ఖండాల రుగ్మతలు, రక్తహీనత, తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన విద్యాబోధనే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

కలిగిరి: పేద విద్యార్థులకు మెరుగైన విద్యాబోధనను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. కలిగిరిలోని గ్రామసచివాలయం ప్రాంగణంలో పాఠశాలల విలీన ప్రక్రియపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. మండలంలోని 29 పాఠశాలలను విలీనం చేయనుండగా 15 పాఠశాలలకు సంబంధించి అభ్యంతరాలు వచ్చాయి. అనంతరం మండలంలో జరుగుతున్న వాటర్‌గ్రిడ్ పనులపై అధికారులు, సిబ్బందితో సమీక్ష జరిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, ఎంఈఓలు రమేష్, సురేష్, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రాజెక్ట్‌లకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి



బిజ్జంపల్లెలో ఆందోళన చేపడుతున్న రైతులు

ఉదయగిరి: ఉదయగిరి ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసే ప్రధాన సాగునీటి వనరులైన వెలిగొండ, సీతారాంసాగర్, పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని రైతు సంఘ నాయకుడు కాకు వెంకటయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని బిజ్జంపల్లి గ్రామంలో రైతు సంఘం, సీతారామసాగర్ సాధన కమిటీ ఆధ్వర్యంలో రైతులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు ప్రాజెక్టుల నిర్మాణాలకు రూ.7 వేల కోట్లు కేటాయించాలన్నారు. ఉదయగిరి ప్రాంతంలో సాగునీటి వసతి సరిగా లేకపోవడంతో ప్రజలు పొట్ట చేతపట్టుకుని బతుకుదెరువు కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు, పాలకులు మారినా బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడంతో నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందగా మారాయన్నారు. గత ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో రూ.394 కోట్లు మాత్రమే కేటాయించడం దారుణమన్నారు. త్వరలో ప్రవేశ పెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌లోనైనా నిర్మాణాలకు అవసరమైన నిధులు కేటాయించాలని, లేకపోతే ఆందోళనలను ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. రైతులు చిన్నపరెడ్డి, ప్రసాద్, నాగయ్య, మధు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దలను ఆస్తులుగా భావించాలి



సీనియర్ విశ్రాంత ఉద్యోగికి సన్మానం

ఆత్మకూరు: ఇళ్లలోని పెద్దలను ఆస్తులుగా భావించి వారిని గౌరవిస్తూ వారిచ్చే విలువైన సలహాలను స్వీకరిస్తూ యువత ఉజ్వల భవిష్యత్‌ను నిర్మించుకోవాలని పలువురు వక్తలు అన్నారు. పట్టణంలోని గ్రంథాలయంలో పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 75 ఏళ్లు నిండిన విశ్రాంత ఉద్యోగులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ తప్పదని, వారి శేషజీవితం ప్రశాంతంగా గడిచేలా పిల్లలు సహకరించాలన్నారు. అనంతరం 75 ఏళ్లు నిండిన ఎస్వీ చలమయ్య, డీ రాఘవేంద్రరావు, పీ మునిప్రసాద్, ఎల్ సీతారావమ్మను సన్మానించారు. అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు జీవీ నారాయణరావు, ఏ నరసింహారెడ్డి, రమణరావు, వెంకటేశ్వరరావు, కృష్ణారెడ్డి, పెంచలయ్య పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



సమీక్ష నిర్వహిస్తున్న ఈడీ నిర్మలాదేవి

సంగం: బీసీ కార్పొరేషన్ ద్వారా ఉపాధి నిమిత్తం మంజూరు చేస్తున్న సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ రుణాలపై ఎంపీడీఓ షాలెట్‌తో కలిసి ఆమె శుక్రవారం సమీక్ష నిర్వహించారు. తొలుత బీసీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించిన దరఖాస్తులను పరిశీలించారు. జనరిక్ మెడికల్ షాపునకు సంబంధించి ఎవరూ దరఖాస్తు చేసుకోకపోవడం గమనించి ప్రజలకు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు గడువు ఈ నెల 15వ తేదీ వరకు ఉందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు 15 వేల దరఖాస్తులు అందాయని చెప్పారు. ప్రతి మండలానికి ఒక జనరిక్ మెడికల్ యూనిట్‌ను కేటాయించినట్లు తెలిపారు. యూనిట్ ధర రూ.8లక్షలు కాగా, అందులో రూ.4 లక్షలను సబ్సిడీ ఇవ్వనున్నట్లు చెప్పారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

బడికెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందే



పాఠశాల ఎదుట పేరుకుపోయిన చెత్త

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని గంగమిట్టలో ఉన్న పాతూరు ప్రాథమిక పాఠశాలకు వెళ్లాలంటే విద్యార్థులు, ఉపాధ్యాయులు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. పాఠశాల పక్కనే పాలసేకరణ కేంద్రం ఉంది. దాని పక్కనే కొందరు ఆకతాయిలు రాత్రి వేళల్లో మద్యం సేవిస్తూ సీసాలు, చెత్తను పాఠశాల దారిలో పడేస్తూ అపరిశుభ్రం చేస్తున్నారు. స్థానికులు సైతం పాఠశాల ఎదుటే చెత్తను పడేస్తున్నారు. పంచాయతీ పాలకులు పట్టించుకోకపోవడంతో చెత్త కుళ్లిపోయి పరిసరాలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెత్త ను తొలగించి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించాలని వినతి

ఉదయగిరి: మండలంలోని గండిపాళెంలో వ్యవసాయ కనెక్షన్లకు అదనంగా మరో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించాలని వైఎంపీపీ గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను కోరారు. వింజమూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో లోడ్ ఎక్కువ కావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరో 25 కనెక్షన్లకు విద్యుత్‌ను సరఫరా చేసే సామర్థ్యం కలిగిన అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయిస్తే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని విన్నవించారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు సంబంధించి నగదును సైతం రైతులు విద్యుత్‌శాఖకు చెల్లించి ఉన్నారని తెలిపారు. రైతుల శ్రేయస్సు దృష్ట్యా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ పాముల రమణయ్య ఉన్నారు.